ప్రకృతి వనాలపై నిర్లక్ష్యం

- పట్టించుకోని అధికారులు
- ఎండిపోతున్న మొక్కలు



తెరుచుకోని తాడూరు ప్రకృతి వనం



యాదిరెడ్డిపల్లి పల్లె ప్రకృతి వనంలో ఎండుతున్న మొక్కలు

తాడూరు: మండలంలోని 24 గ్రామాలలో ప్రజలు సేదతీరేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద పల్లె పకృతివనాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టిపడేలా ప్రభుత్వ చర్యలు తీసుకుంది. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రజలు ప్రకృతి వనాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు వేసవి సమీపించడంలో 3 నెలలు మొక్కలను సంరక్షించకుంటే ఎండిపోయే ప్రమాదం ఉంది. 2020లో మండలంలోని అన్ని గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఎకరా స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రభుత్వ స్థలాలు లేక 10 నుంచి 20 కుంటలలో ఏర్పాటు చేశారు. రకరకాల మొక్కలు నాటడంతో పాటు నడిచేందుకు ట్రాక్ నిర్మించారు, కొన్ని గ్రామాల్లో మాత్రమే వనాలకోసం ఎకరా స్థలం కేటాయించారు. పల్లె ప్రకృతి వనాల్లో దాదాపు 18 నుంచి 19 వేల మొక్కలను నాటారు. ప్రస్తుతం నాటిన మొక్కలు పెరిగి పెద్దగా అయ్యాయి. ఇవి గ్రామాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచినప్పటికి గేట్లకు తాళాలు వేయడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. రెండేళ్ల పాటు పల్లె ప్రకృతి వనాల సంరక్షణకు వాచార్లను ఏర్పాటు చేశారు. నెలకు రూ.5 వేల వేతనం చెల్లించారు. తరువాత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు వనాల సంరక్షణ బాధ్యత అప్పగించి వాచర్‌మెన్‌లను తొలగించింది. వనాలకు అందుబాటులో ఎలాంటి బోరు బావులు లేవు. వేసవిలో మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అధికారులు శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్వహణలోపం..

పకృతివనాల నిర్వహణ బాధ్యత జిల్లా ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీలకు అప్పగించింది. పాలక వర్గాల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంరక్షిస్తున్నారు. మొక్కల సంరక్షణకు ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున వారానికి 3 సార్లు నీరు పట్టాలి. కాని ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

మండలంలో...

మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలలో రూ. వేల నిధులు వెచ్చించి వివిధ ప్రాంతాల నుంచి మొక్కలు కొనుగోలు చేశారు. తీసుకొచ్చిన మొక్కలు ఆర్బాటంగా నాటారు. కాని అధికారుల పర్యవేక్షణ కరువైంది.

చర్యలు తీసుకుంటున్నాం...

పల్లె ప్రకృతి వనాల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలను కాపాడేందుకు పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించాం. వారానికి రెండు సార్లు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– అంజనేయులు, ఎంపీడీఓ, తాడూరు

క్లుప్తంగా

27 మేకల సంత వేలం

చారకొండ: మండలంలోని జూపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే మేకల, గొర్రెల సంతకు ఈ నెల 27న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు 26న సాయంత్రం 4 గంటల లోపు జూపల్లి గ్రామ పంచాయతీ పేరున రూ. 50 వేలు డీడీ తీసి అధికారులకు అందజేయాలని తెలిపారు. 27 ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఘనంగా వనమహోత్సవం

చారకొండ: మండలంలోని జూపల్లి, చారకొండ, తిమ్మాయిపల్లి, చంద్రాయన్‌పల్లి, జేపల్లి, గోకారం గ్రామాల్లో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా వన ఆవాసంలోకి వెళ్లి అక్కడే వంటావార్పు చేసి వన దేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. చిన్నారులు, యువకులు ఉయ్యాలు, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా తైక్వాండో అధ్యక్షుడిగా తెప్పశ్రీను

కందనూలు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. తైక్వాండో జిల్లా అధ్యక్షుడిగా తెప్పశ్రీనును నియమించారు. సమావేశంలో 20 జిల్లాల నుంచి అసోసియేషన్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి ఎన్నికైన వారికి రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం కృష్ణ, జనరల్ సెక్రెటరీ వాహజ్ అలీ ఖాన్ నియామక పత్రాలు అందించారు. ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, ట్రెజరర్‌గా స్వాతిని పలువురు అభినందించారు.

దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండా ఆంజనేయ దేవాలయ నిర్మాణానికి వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ దేవాలయ కమిటీ సభ్యులకు సోమవారం రూ.1.10 లక్ష విరాళం అందజేశారు. దేవాలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని భాస్కర్ రావు తెలిపారు. కార్యక్రమంలో తండా దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంగ్లిష్ పరీక్షకు మన్ననూర్‌లో 268 మంది విద్యార్థులకు 5 మంది గైర్హాజరు కాగా అమ్రాబాద్ 105 మంది, పదరలో143 మంది, దోమలపెంట 52 మంది విద్యార్థులు వందశాతం హాజరయ్యారు.

రూ.1.22 లక్షల ఆదాయం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఏప్రిల్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన వేలం ద్వారా ఆలయానికి రూ.1.22 లక్షల ఆదాయం సమకూరింది. గ్రామ పంచాయతీ ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ ఆధ్వర్యంలో టెంకాయల విక్రయాలు, తైబజార్ వేలంను నిర్వహించారు. టెంకాయల అమ్మకాన్ని కె.నిరంజన్ రూ.82 వేలకు దక్కించుకోగా, తైబజార్‌ను జి.సాయికుమార్ రూ. 40 వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద ముద్దునూరులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద ముద్దునూరు గ్రామానికి చెందిన మహమ్మద్ (60) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే వ్యవసాయ పొలానికి నీళ్లు పట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు మాక్సూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వెల్దండ: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను తహసీల్దార్ కార్తీక్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. వంటసామాగ్రి, కూరగాయాలు, పప్పులు, నూనెలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు వినియోగించుకోండి

వంగూరు: రెడ్‌క్రాస్ సంస్థ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ సంస్థ శాశ్వత సభ్యులు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట్ల గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రక్తం అవసరం ఉన్న వారు రెడ్‌క్రాస్ సంస్థను సంప్రదించాలని కోరారు.

టీబీ నివారణపై ర్యాలీ



కోడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ నివారణపై ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తయాబ్ మాట్లాడుతూ టీబీ నివారణకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. టీబీ ఉన్న వారు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మివేయరాదని సూచించారు. సీహెచ్‌ఓ సుదర్శన్, ల్యాబ్ టెక్నిషియన్ నారాయణ, ఫార్మాసిస్టు దిలీప్, శ్రీనివాస్, సురేష్, రాజేష్, శిరిష, ఏఎన్‌ఎంలు రమణమ్మ, వెంకటలక్ష్మి, వనజరాణి, సాయిలీల పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

తాడూరు: మండలంలోని ఎత్మతాపూర్‌లో శతాధిక గ్రంథకర్త, ప్రబోధ ఆశ్రమం పీఠాధిపతి ఆచార్య ప్రబోధనంద యోగేశ్వరస్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను సోమవారం పంపిణీ చేశారు. ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు మనోహర్, సాయిశంకర్, రమాదేవి ఉన్నారు.



బీసీలకు అన్యాయం

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ.11 వేల కోట్లు కేటాయించడం సరికాదన్నారు. రూ.లక్ష 30 వేల కోట్ల కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బాబీదేవ్, సురేందర్‌గౌడ్, చందు ముదిరాజు, రాజశేకర్, శ్రీధర్, చంద్రశేఖర్, శివ, అరవింద్‌రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి



ఊర్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణయ్య పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన మండలంలోని నర్సంపల్లిని సోమవారం ఎంపీడీఓ సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని గ్రామాలలో ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని తెలిపారు. గుణగుంట్ల పల్లి నుండి రెడ్యాతండా ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సాయిరూప, మంజుల, భారతమ్మ, ఈసీ జగన్ లాల్, క్షేత్ర పరిశీలకులు కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలం చందుభట్లలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలోని ఉద్యానవనాన్ని పరిశుభ్రం చేసి చెత్తను తొలగించారు. నిరక్షరాస్యులైన విద్యార్థులను, వృద్ధులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేసుకున్నారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి పూర్తి స్థాయిలో రికార్డు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణారావు, పంచాయతీ సెక్రెటరీ అన్వేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మహాసభలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ హాజరై సోమవారం జిల్లా కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎండీ సయ్యద్, కార్యదర్శిగా తారాసింగ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, జమాలుద్దీన్, కార్యదర్శులుగా జశ్వంత్‌తో పాటు 17 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

పార్టీ బలోపేతానికి ఐక్యతతో ముందుకెళ్దాం

కొల్లాపూర్: పార్టీ బలోపేతానికి ఐక్యతతో ముందుకెళ్దామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సూచించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎల్లేని మాట్లాడుతూ రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించానని సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలుపొందేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కోరారు. నాయకులు శేఖర్‌గౌడ్, సందు రమేష్, కేతూరి నారాయణ, సాయికృష్ణగౌడ్, కాడం శ్రీనివాస్, భరత్‌చంద్ర, భాస్కర్, శివకృష్ణయాదవ్, శ్రీరామ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



నాయకులతో ఎల్లేని సుధాకర్‌రావు

పంచాయతీ కార్యదర్శికి వినతి

పెద్దకొత్తపల్లి: చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్మికులు కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, ఎల్లమ్మ, రామకృష్ణ, మశన్న పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్

పెద్దకొత్తపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం తహసీల్దార్ జేకే మోహన్ తనిఖీ చేశారు. కేంద్రాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. మూడో రోజు ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మొత్తం మూడు సెంటర్లలో 587 మంది విద్యార్థులకు వందశాతం విద్యార్థులు హాజరయ్యారు.

కేబుల్‌వైర్లు చోరీ

వంగూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ పొలాల్లో ఉన్న బోరు బావుల వద్ద కేబుల్ వైర్లను దొంగలు చోరీ చేశారు. గాజర, తిప్పారెడ్డిపల్లి, నర్సంపల్లి, కోనేటిపూర్ గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్లవద్ద ఉన్న కేబుల్‌ను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాదాపు 20 మందికి సంబంధించిన రూ.2లక్షల కేబుల్ తీసుకెళ్లినట్లు రైతులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గత వారంలో వంగూరు, వెలుమలపల్లి పరిసర ప్రాంతాల రైతుల కేబుళ్లను కూడా ఎత్తుకెళ్లారు. దొంగలను త్వరలో పట్టుకొని ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



అచ్చంపేట రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఆర్డీఓ మాధవి అన్నారు. సోమవారం మండలంలోని అంకిరోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి ప్రారంభించారు. అంకిరోనిపల్లిని మాడల్ విలేజ్‌గా తీసుకుని నిర్మాణాలు చేపడుతామన్నారు. గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఆర్ఐ బాల్‌రాం, మాజీ ఎంపీపీ రామనాథం, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అస్వస్థత

కల్వకుర్తి టౌన్: పది పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినికి అస్వస్థతకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది తెలిపిన వివరాలిలా పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని గీత పట్టణంలోని నిర్మల విద్యాలయంలో పరీక్ష రాస్తుంది. పరీక్ష రాసి తర్వాత బయటకు వస్తూ అకస్మాత్తుగా కిందపడింది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. విద్యార్థిని శ్వాస తీసుకోవటంతో కొంత ఇబ్బంది పడిందని ప్రస్తుతం కోలుకుందని వైద్యులు తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈఓ



కల్వకుర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సోమవారం డీఈఓ రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలో 229 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 228 హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

ప్రశ్నాపత్రాల తరలింపు జాగ్రత్తగా చేపట్టాలి

కల్వకుర్తి టౌన్: పది పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపును జాగ్రత్తగా చేపట్టాలని, సరైన కోడ్ నంబర్‌ను చూసుకొని పరీక్ష కేంద్రాలకు పంపాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని పలు పది పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని 8 పరీక్షా కేంద్రాలను పరిశీలించి, ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరా సమక్షంలో ఓపెన్ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. పది పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్‌లదే కీలకపాత్ర అని, విధులలో అలసత్వం లేకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు బాగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీ ఉన్న పాఠశాలను, ఊర్కొండ మండలానికి చెందిన కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టికలను పరిశీలించి, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. డీఈఓ వెంట ఎస్‌ఓ శైలజ, సిబ్బంది ఉన్నారు.

ఆశావర్కర్ల అక్రమ అరెస్టు తగదు



నాగర్‌కర్నూల్‌లో అరెస్ట్ అయిన ఆశావర్కర్లు, నాయకులు

కొల్లాపూర్: సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం తగదని ఆశావర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. సోమవారం ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలుచేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో శివవర్మ, సలీమ్, ఆశావర్కర్లు ఉన్నారు.

హామీలను నెరవేర్చాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆశావర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామ్యమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య అన్నారు. సోమవారం ఆశావర్కర్లు చలో హైదరాబాద్‌కు తరలకుండా ముందస్తు అరెస్ట్ చేయడం తగదన్నారు. నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నాయకులు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆశాకార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. అనంతరం సాయంత్ర సొంతపూచీకత్తుతో విడుదల చేశారు.

ముందస్తు అరెస్టు

చారకొండ: ఆశాకార్యకర్తల రాష్ట్ర కమిటీ కమిషనర్ రేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో సోమవారం ముందస్తుగా ఆశకార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశాకార్యకర్తలు మాట్లాడుతూ ఆశాకార్యకర్తలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో సత్యవతి, రాములమ్మ, సువర్ణ, భాగ్యమ్మ, రాణి, సుజాత, జ్యోతి, యాదమ్మ, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ హామీతో విరమించిన దీక్షలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కొన్ని రోజులుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్ష సోమవారం ముగించారు. తహసీల్దార్ విజయశర్మ దీక్ష శిబిరం దగ్గరకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 22, 27 సర్వే నంబర్‌లో గల భూమి వివరాలు పూర్తిగా సేకరించి ఇళ్ల స్థలాల పంపిణీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్, తిమ్మస్వామి, పెంటయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శాపం కాకూడదు

బిజినేపల్లి: వైకల్యం వారి పాలిట శాపం కాకూడదని డిప్యూటీ చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. సోమవారం మండలంలోని వట్టెం బాలుర ఉన్నత పాఠశాలలో నాల్సా లీగల్ సర్వీసెస్ టూ పర్సన్స్ విత్ మెంటల్‌నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజెబులిటీస్ స్కీం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆర్య మాట్లాడుతూ వైకల్యం కారణంగా తక్కువ చూపు చూడరాదని, వ్యక్తిగత స్వేచ్ఛను హరించరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపాల్ రావు, పారా లీగల్ వలంటీర్ ఎస్.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

వంగూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులందరిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని హోమం

సాక్షి, నెట్‌వర్క్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి ఆలయలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. బల్మూరు మండలం కొండనాగుల పెద్దగుడిబండ శివాలయంలో శివలింగానికి జలాభిషేకం చేశారు. మన్ననూర్‌లో ఈదమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థి ప్రతిభ

పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లోని కొల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి కే రామకృష్ణ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు బాలు, ఉపాధ్యాయులు విద్యార్థి రామకృష్ణను అభినందించారు.

సమావేశ మందిర పనులు ప్రారంభం

తిమ్మాజిపేట: గతంలో నిధుల కొరతలో అర్ధాంతరంగా నిలిచిన మండల కేంద్రంలోని మండల పరిషత్ మీటింగ్ హాల్ నిర్మాణం పనులను సోమవారం ఎంపీడీఓ లక్ష్మీదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి కృషితో రూ.6 లక్షలు మంజూరుకు చేశారని కృషి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, డీఈ జవహర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘు, జూనియర్ అసిస్టెంట్ యూసుఫ్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

కోడేరు: రాయితీ పనిముట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈఓ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనిముట్లు మహిళా రైతులు అర్హులని పేర్కొన్నారు. మండలానికి మొత్తం 15 యూనిట్లు మంజూరు అయ్యాయని ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉప ప్రణాళిక పథకం కింద మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇచ్చేందుకు నిధులు మంజూరయ్యావని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మహిళా రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లను అందించనున్నామని తెలిపారు. మండలంలో 28 యూనిట్లకు గానూ రూ. 11.32 లక్షల బడ్జెట్ కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. భూమి ఉన్న మహిళా రైతులు అర్హులని వివరించారు.

వెల్దండ: ప్రభుత్వం సబ్సిడీలో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తుందని ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 యూనిట్లను మంజూరయ్యాయిని తెలిపారు.

సర్టిఫికెట్ల జారీపై అధికారులతో వాగ్వాదం



డిప్యూటీ తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగిన దరఖాస్తుదారులు

తిమ్మాజిపేట: కొన్ని రోజుల నుంచి కులం, ఆదాయం సర్టిఫికెట్లు జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించింది. నిరుద్యోగులు సంబంధిత ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కులం సర్టిఫికెట్లు తహసీల్దార్, ఆదాయం సర్టిఫికెట్లు డిప్యూటీ తహసీల్దార్ ఇవ్వాల్సి ఉంది. ఎలాంటి విచారణ చేయకుండానే ఆయా పథకాలకు దూరం అయ్యే విధంగా ఆదాయం రూ.1.60 వేస్తున్నారు. దీంతో అర్జిదారులు డిప్యూటీ తహసీల్దార్‌తో సోమవారం కార్యాలయంలో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై తహసీల్దార్ రామకృష్ణను వివరణ కోరగా సర్టిఫికెట్ల జారీ విషయంతో పూర్తి విచారణ చేపట్టి నిరుద్యోగులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ – జి. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ – వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి – యం. విజయ్ - 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:
పి. మధుసూదన్ గౌడ్ : 90100 06785